సాక్షి
విశాఖపట్నం
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



పండగల వెనుక సందేశం

పండగ అనేది ఏ మతానికి సంబంధించినదైనా.. దాని వెనుక గొప్ప సందేశం దాగి ఉంటుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 8లో



సరికొత్తగా సమ్మేటివ్ పరీక్షలు

ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఒకే విధానంలో సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించనున్నారు. 8లో

భిన్నమైన కథతో ఏజెంట్



విభిన్నమైన కథ, కథనంతో రూపొందించిన చిత్రం ఏజెంట్ అని ఆ సినిమా హీరో అఖిల్ అక్కినేని అన్నారు.

8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.32 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 21 రోజులకు కోటి 32 లక్షల 74వేల 645 రూపాయలు వచ్చినట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై ఆలయ బేడ మండపంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 65.500 గ్రాముల బంగారం, 10.900 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు జడ్జిలకు బదిలీ

విశాఖ లీగల్: విశాఖలోని సీనియర్ సివిల్ జడ్జిలకు బదిలీ జరిగింది. సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్ర హైకోర్టు బుధవారం న్యాయమూర్తులకు స్థానచలనం కలిగించింది. విశాఖలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ వస్తున్నారు. అలాగే గుంటూరు లోక్ అదాలత్ కె.రత్నకుమార్ విశాఖలోని ఆరో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. నగరంలోని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి జె.సుజాత కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నగరంలోని రెండో అదనపు సివిల్ జడ్జి వివేకానంద్ వస్తున్నారు. అనంతపురం జిల్లా కదిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు విశాఖలోని రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వస్తున్నారు. విశాఖలోని ఆరో అదనపు సివిల్ జడ్జిగా గుంటూరు నుంచి జి.చంద్రమౌళేశ్వరి బదిలీపై వస్తున్నారు.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ మూల్యాంకనం బుధవారంతో ముగిసింది. జిల్లాకు సుమారుగా 6.50 లక్షల జవాబు పత్రాలను కేటాయించగా, సకాలంలో వీటి మూల్యాంకనం పూర్తి చేసేలా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మూల్యాంకనంకు సంబంధించిన పూర్తి వివరాలను బోర్డు ఉన్నతాధికారులకు నివేదించామని ఆర్ఐవో ఉమారాణి, డీఐఈవో సత్యనారాయణ తెలిపారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

సింహాచలం: నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ అండ్ ఇనిస్టిట్యూట్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు (బాలికలు)మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు, ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు చేసిన విద్యార్థులు ఆప్తాల్మిక్ టెక్నీషియన్ కోర్సులో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఏ గ్రూపులోనైనా ఉత్తీర్ణులైన విద్యార్థులు డిప్లమా ఇన్ మెడికల్ స్టెరిలైసేషన్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ కోర్సు, డిప్లమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు, డిప్లమో ఇన్ ఆప్టోమెట్రీ టెక్నీషియన్ కోర్సుల్లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఎస్సీ ఆప్టోమెట్రీలో చేరేందుకు అర్హులన్నారు. వివరాలకు 9121005933లో సంప్రదించాలని తెలిపారు.

339 మంది సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్

సాక్షి, విశాఖపట్నం : రెండో విడత నోటిఫికేషన్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన వారికి ప్రొబేషన్ ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. విశాఖ జిల్లాలో మొత్తం 339 మంది సచివాలయ ఉద్యోగులకు ప్రొబెషన్ వర్తించనుంది. వీరు ప్రస్తుతం రూ.15 వేల గౌరవ వేతనంతో పనిచేస్తున్నారు. ప్రొబేషన్ ఖరారు అనంతరం రెట్టింపు జీతం అందుకోనున్నారు. వీరికి సంబంధించిన జాబితాను డీఎల్‌డీవో పూర్ణిమాదేవి సిద్ధం చేశారు. ఈ ఫైల్ కలెక్టర్ డా.మల్లికార్జున పరిశీలనలో ఉంది. వారం చివరిలో ప్రొబేషన్ ప్రక్రియ పూర్తికానుందని అధికారులు చెబుతున్నారు. ప్రొబేషన్ అర్హత పొందిన వారిలో వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీలు అత్యధికంగా 86 మంది ఉండగా, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు 51, విలేజ్ రెవెన్యూ అధికారులు, వార్డు రెవెన్యూ అధికారులు 46, వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీలు 39 మంది, వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలు 33 మంది ఉన్నారు.

3న ముహూర్తం

- అదానీ డేటా సెంటర్ పార్కుకు సీఎం జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన
- మధురవాడ హిల్–4లో 130 ఎకరాలు సిద్ధం చేసిన ఏపీఐఐసీ
- దశలవారీగా రూ.14,634 కోట్ల పెట్టుబడులకు జీఐఎస్‌లో అదానీ ఒప్పందం
- సీహారియర్, ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా కూడా ప్రారంభించే అవకాశం



అదానీ డేటా సెంటర్ నమూనా

పరిశ్రమ	ఉపాధి
డేటా సెంటర్ పార్కు	1240
ఐటీ బిజినెస్ పార్కు	22,200
స్కిల్ యూనివర్సిటీ	550
రిక్రియేషన్ సెంటర్	1000

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. రూ.14,634 కోట్లతో 25 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్ పార్క్‌కు మే 3వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. మధురవాడలోని హిల్‌పార్క్–4లో 130 ఎకరాలను ఏపీఐఐసీ సిద్ధం చేసి.. సరిహద్దులను కూడా నిర్ణయించింది. శంకుస్థాపనకు సంబంధించిన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ సంస్థ అదానీ మధురవాడ సమీపంలో డేటా సెంటర్ పార్కుతో పాటు బిజినెస్ పార్కు, ఐటీ సంస్థ, స్కిల్ యూనివర్సిటీ, రిక్రియేషన్ సెంటర్‌లు ఏర్పాటు చేయనుంది. త్వరలోనే డేటాపార్క్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

మూడేళ్లలోపు కార్యకలాపాలు

డేటా సెంటర్ పార్క్, ఐటీ బిజినెస్ పార్కు, నైపుణ్యాభివృద్ధి వర్సిటీ నిర్మాణాలకు మధురవాడ సర్వే నెంబర్ 409లో ఎకరానికి రూ.కోటి చొప్పున 130.35 ఎకరాలను కేటాయించింది. ఇక భూమి ఇచ్చిన మూడేళ్లలోపు కచ్చితంగా కార్యకలాపాలు ప్రారంభించాలని, ఏడేళ్లలోపు నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 82 ఎకరాల్లో 200 మెగావాట్ల సామర్థ్యంలో డేటా సెంటర్ పార్కు, 28 ఎకరాల్లో ఐటీ బిజినెస్ పార్కు, 11 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, 9 ఎకరాల్లో రిక్రియేషన్ పార్కు ఏర్పాటు చేయనుంది. అదానీ కోసం కేటాయించిన స్థలానికి ఎకరానికి రూ. కోటి చొప్పున లీజు మొత్తం నిర్ణయించగా.. మొత్తం రూ.130 కోట్లు సంస్థ ప్రభుత్వానికి చెల్లించింది. అదానీకి అందివ్వాల్సిన భూముల సరిహద్దులను ఏపీఐఐసీ సిద్ధం చేసింది. ఏడేళ్ల కాలం పాటు చెల్లించే స్టేట్ జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించనుంది.

25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు

మొదటి మూడేళ్ల కాలంలో 30 మెగా వాట్లు డేటా సెంటర్ పార్కు పూర్తి చేయడంతో పాటు, నాలుగేళ్ల నాటికి 60 మెగావాట్లు, 5 ఏళ్లకు 110 మెగావాట్లు, 6 ఏళ్లకు 160 మెగావాట్లు, ఏడేళ్లకు 200 మెగావాట్లు కింద మొత్తం వ్యవస్థని ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగ కల్పన విషయంలోనూ దశలవారీ పురోగతి చూపించనున్నారు. మొదటి మూడేళ్ల కాలంలో 30 శాతం మందికి అంటే 6,300 మందికి, ఐదేళ్ల నాటికి 70 శాతం, ఏడేళ్లకు 100 శాతం ఉద్యోగ, ఉపాధి కల్పన పూర్తి చేయనున్నారు. 200 మెగావాట్ల డేటాసెంటర్ పార్కులో 1240 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు, ఐటీ బిజినెస్ పార్కులో 1200 మందికి ప్రత్యక్ష ఉపాధి, ఐటీ బిజినెస్ పార్కు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐటీ కంపెనీల ద్వారా 21,000 మందికి ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించనున్నారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా 550 మందికి, రిక్రియేషన్ ద్వారా 1000 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించేలా అదానీ సెంటర్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. శంకుస్థాపనకు అదానీ సంస్థ నుంచి ముఖ్యులు హాజరయ్యే అవకాశాలున్నాయని కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు.

సీహారియర్, స్పోర్ట్స్ ఎరీనా కూడా..

అదే రోజున మరో రెండు ప్రాజెక్టుల్ని కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే అవకాశాలున్నాయి. ఎంవీపీ కాలనీలో రూ.24 కోట్లతో అత్యాధునిక స్పోర్ట్స్ ఎరీనాని జీవీఎంసీ నిర్మించింది. ఇటీవలే ఈ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. అదేవిధంగా.. బీచ్‌రోడ్డులో దాదాపు రూ.7.5 కోట్ల వ్యయంతో సీహారియర్ యుద్ధ విమాన మ్యూజియంని నిర్మించారు. ఇప్పటికే బీచ్ రోడ్డలో టీయూ140 యుద్ధ విమాన మ్యూజియం, ఐఎన్ఎస్ కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం సందర్శకుల్ని అలరిస్తున్నాయి. సీహారియర్ కూడా ప్రారంభమైతే.. ఇంటిగ్రేటెడ్ మ్యూజియంలుగా ఈ మూడు.. విశాఖ సాగర తీరంలో పర్యాటకానికి కేంద్ర బిందువుగా మారనున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టులు కూడా అదే రోజున సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



స్పోర్ట్స్ ఎరీనా

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా సీఎం జగన్ ప్రత్యేక విమానంలో బుధవారం 9.15గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో 9.39 గంటలకు శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరారు. అక్కడ పర్యటన ముగించుకుని 2.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 2.34 గంటలకు గన్నవరం బయలుదేరారు. ముఖ్యమంత్రికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీలు బి.సత్యవతి, జి.మాధవి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్ తదితరులు స్వాగతం, వీడ్కోలు పలికారు.



కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

రేపు స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నారు. స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో 97 అంశాలు సభ్యుల ఆమోదానికి రానున్నాయని కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు. జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్, శాంతినగర్, అంబేడ్కర్ నగర్, కరాసలో రూ.49.50 లక్షలతో 1100 మీటర్ల భూగర్భ మురుగు నీటి కనెక్షన్ల పొడిగింపు, రూ.48.50 లక్షలతో మద్రిపాలెం, వుడా లేఅవుట్ గ్రీన్ బెల్ట్ ప్రాంతానికి ఎంఎస్ ఫెన్సింగ్ ఏర్పాటు, ఇదే ప్రాంతంలో రూ.40లక్షలతో మేజర్ ఈఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం, రూ.38 లక్షలతో మెహర్ మార్గానికి బీటీ రోడ్డు, రూ.39లక్షలతో శృతి టిఫెన్ షాపు పక్కన మేజర్ డ్రెయిన్ నిర్మాణం, రూ.38 లక్షలతో కరాసలోని హిందూ శ్మశాన వాటిక వద్ద మేజర్ వీఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం, రూ.36.50లక్షలతో క్రిస్టియన్ శ్మశాన వాటిక వద్ద వీఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం, 75వ వార్డు పరిధి పెదగంట్యాడలోని ఎస్సీ కాలనీ సీతానగరంలో రూ.3 5లక్షలతో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర అంశాలపై చర్చ సాగనుంది.

11 కరోనా కేసుల నమోదు

అనారోగ్యంతో దివ్యాంగుడు మృతి

మహారాణిపేట: విశాఖలో రోజురోజుకూ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. బుధవారం 251 మందికి పరీక్షలు నిర్వహించగా.. 11 మందికి కరోనా నిర్ధారణ అయింది. 10 మంది డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం 33 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 31 మంది హోం ఐసోలేషన్ ఉండగా, ఇద్దరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాగా.. మాధవధారలోని లవ్ అండ్ కేర్ సెంటర్‌లో అనాథ పిల్లలకు కోవిడ్ సోకడంతో భయాందోళన నెలకొంది. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న 21 ఏళ్ల మానసిక దివ్యాంగుడికి ఈ నెల 17న రాపిడ్ యాంటిజెన్ పరీక్ష నిర్వహించగా.. కోవిడ్ నిర్ధారణ అయింది. వెంటనే అతన్ని కేజీహెచ్‌లోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అప్పటికే ఈ యువకుడికి న్యూమోనియా, ఇతర వ్యాధులు ఉన్నట్లు వైద్యులు గుర్తించి చికిత్స అందించారు. అదే సమయంలో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష నిర్వహించారు. చికిత్స పొందుతూ ఆ యువకుడు మంగళవారం చనిపోయాడు. అప్పటికి ఆర్‌టీపీసీఆర్ నివేదిక రాకపోవడంతో కోవిడ్ ప్రోటోకాల్ ప్రకారం కాన్వెంట్ జంక్షన్‌లోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆ తరువాత వచ్చిన రిపోర్టులో నెగిటివ్ అని తేలిందని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆ యువకుడు కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. ఇదే ఆశ్రమానికి చెందిన ఓ బాలికకు పరీక్షలు నిర్వహించామని.. నెగిటివ్ వచ్చిందన్నారు. కానీ ఇతర వ్యాధుల కారణంగా బాలిక ఆరోగ్యం కూడా విషమంగా ఉందని ఆయన వెల్లడించారు.

829 మందికి ప్రైవేటు పాఠశాలల సీట్లు

విశాఖ విద్య: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసమని 25 శాతం సీట్లు కేటాయింపు ప్రక్రియలో భాగంగా తొలివిడత అర్హులైన విద్యార్థుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. విశాఖ జిల్లాకు చెందిన 829 మంది విద్యార్థులకు జాబితాలో అవకాశం దక్కింది. సీటు పొందిన విద్యార్థులు కేటాయించిన పాఠశాలల్లో ఈ నెల 25లోపు అడ్మిషన్ పొందాలని విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండో విడత జాబితాను ఈ నెల 29న విడుదల చేసేందుకు విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. విశాఖ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు 592 వరకు ఉన్నాయి. వీటిలో 25 శాతం సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022–23 విద్యా సంవత్సరం నుంచే దీనిని అమలు చేయగా, అప్పుడు కేవలం 114 మంది విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్యకు అవకాశం లభించింది. విద్యా హక్కు చట్టం పటిష్టంగా అమలు చేసే క్రమంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచిత విద్యకు కేటాయింపుపై ఈ ఏడాది జిల్లా విద్యాశాఖాధికారులు విస్తృతమైన ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలోనే 2023–24 విద్యా సంవత్సరానికి ప్రైవేటులో ఉచిత విద్య కోసమని 1,490 మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలివిడతగా 829 మందిని ఎంపిక చేశారు. వీరిందరికీ ఉచిత ప్రవేశాలు కల్పించేలా డివిజన్, మండల స్థాయిలో ఉన్న విద్యాశాఖాధికారులు బాధ్యత తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు.

విశాఖ జిల్లానే నంబర్‌వన్

ఈ జాబితాలో విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థులే అత్యధికంగా ఉన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తొలి విడత జాబితాలో 9,064 మందికి అవకాశం లభించగా, ఇందులో జిల్లాకు చెందిన 829 మందికి చోటు దక్కింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేవలం ఒక్క విద్యార్థికి మాత్రమే అవకాశం లభించింది.

చందనోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు
- వీవీఐపీల దర్శనాలకు ప్రత్యేక స్లాట్లు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

దొండపర్తి: సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం ఈ నెల 23న జరుగుతున్న దృష్ట్యా.. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సమక్షంలో చందనోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. చందనోత్సవం రోజు తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య ఆలయ ధర్మకర్త, వారి కుటుంబ సభ్యులతో పాటు దేవదాయశాఖ మంత్రి స్వామిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పిస్తామని తెలిపారు. 3.30 నుంచి 4.30 గంటల మధ్య వీవీఐపీ దర్శనాలు, దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యుల దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. కేటాయించే టికెట్లలో దర్శన సమయం ముద్రించి ఉంటుందన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 వరకు ఉచిత దర్శనంతో పాటు రూ.300, రూ.1000 టికెట్లపై భక్తులు దర్శనం చేసుకోవచ్చన్నారు. వీవీఐపీలకు స్లాట్–1 ఉదయం 5 నుంచి 7.00 గంటల మధ్య, స్లాట్–2 ఉదయం 8 నుంచి 10 మధ్య దర్శన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మీడియాకు ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య దర్శనం ఉంటుందన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ కొండపై, కొండ దిగువన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్‌పై చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి 20 మీటర్లకు ఒక వాటర్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాటర్ బబుల్స్‌లో నీటిని పేపర్ గ్లాసుల ద్వారా సరఫరా చేయాలన్నారు. టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. కొండపై, దిగువన, పుష్కరిణి, భైరవ కోన, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహించాలన్నారు. భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాల్లో అవసరమైన చోట, నడక మార్గంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు చెప్పారు. అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, సింహాచలం ఈవో త్రినాథరావు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఆజాద్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

దొండపర్తి: చందనోత్సవంలో ఎటువంటి అపశృతులకు అవకాశం లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో బుధవారం ఉన్నతాధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్, బారికేడింగ్, భక్తుల సౌకర్యార్థం చేస్తున్న ఏర్పాట్లు, క్యూలు, మెట్ల మార్గం ఇతర ప్రాంతాల్లో కల్పిస్తున్న బందోబస్తుపై చర్చించి.. పలు సూచనలు చేశారు. భక్తులతో పాటు నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శారదా పీఠంలో దేవదాయశాఖ కమిషనర్



స్వామిజీలతో మాట్లాడుతున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.సత్యనారాయణ బుధవారం శారదాపీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల ఆశీస్సులు తీసుకున్నారు. పీఠం అధిష్టాన దేవత రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవానికి స్వామీజీలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. దేవదాయ భూముల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి కమిషనర్‌కు సూచించారు. ఆలయాల్లో అమలులో ఉన్న ఆగమ విధానాలను సమీక్షించాలని, ధార్మిక సలహా మండలి సమావేశాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- సాక్షి సంపాదకుడు వర్ధెల్లి మురళి
- శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో ఉత్సాహంగా 'కేరింతలు 2023'





విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న సాక్షి సంపాదకుడు మురళి, ఆకట్టుకున్న విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన

నక్కపల్లి/ పాయకరావుపేట: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాక్షి దినపత్రిక సంపాదకుడు వర్ధెల్లి మురళి అన్నారు. బుధవారం ఆయన పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో కేరింతలు 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రవైభవం పేరుతో తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే ప్రయత్నంలో భాగంగా శ్రీప్రకాష్ విద్యాసంస్థ కేరింతలు కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు జాతికి సంబంధించి సాహిత్యం, ఆటపాటలు, కళారూపాలు, నడవడిక నియంత్రించే సంప్రదాయాలు, కట్టుబాట్లు ఎన్నో ఉన్నాయని, జానపద కళారూపాలు, నృత్యాలు, భాష, వ్యాకరణం వంటి ఎన్నో అంశాలున్నాయని, ఇవన్నీ తెలుగుజాతి వారసత్వ సంపద అని పేర్కొన్నారు. తెలుగు జాతి ఎన్నో రంగాల్లో వెనుకబడి ఉందని, తెలుగుతల్లి కాపాడుకో అంటూ జంధ్యాల పాపయ్యశాస్త్రి రాసిన కావ్యాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైతాళికుల పాత్రలను పోషించడానికి ఇటువంటి విద్యాసంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. నేడు సంస్కృతి మీద దాడి చేసే పరిణామాలు చాలా ఉన్నాయని, దీనిలో ముఖ్యంగా పిల్లలపై మొబైల్ ఫోన్‌ల ప్రభావం చాలా ఉందన్నారు. దీని ప్రభావం మంచి కంటే చెడు ఎక్కువగా వ్యాపిస్తోందన్నారు. పిల్లలకు ఫోన్‌లకు బదులు డెస్క్ టాప్‌లు, చెత్త యాప్‌లు లేని ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. 18 ఏళ్లు వచ్చే వరకు పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దని ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మనవి చేస్తున్నానన్నారు. డక్కన్ ఫైన్ కెమికల్స్ వైస్‌ప్రెసిడెంట్ ఆనందరావు మాట్లాడుతూ డబ్బుంటేనే ఐశ్వర్యవంతుడు కాదని, మంచి నడవడిక, ఆరోగ్యం, మంచి బుద్ధులు కలిగిన సంతానం కలిగి ఉన్నవాడే నిజమైన ఐశ్వర్యవంతుడన్నారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాన్ని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే తమ విద్యాసంస్థలో ఒకటినుంచి 5వ తరగతి చదువుతున్న సుమారు 800 మంది విద్యార్థులతో ఆంధ్ర వైభవాన్ని చాటిచెప్పే విధంగా తెలుగు జాతి ఔన్నత్యాన్ని సంప్రదాయాన్ని నాటక పద్య, గేయ, నృత్యరూపంలో ప్రదర్శన ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అత్యంత ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అతిథులతో పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత సిహెచ్‌వికే నర్సింహరావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ మూర్తి పాల్గొన్నారు.

'పల్లా'పై తిరుగుబావుటా..

- విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్ష పదవి నుంచి తప్పించండి
- టీడీపీ గాజువాక నాయకుల డిమాండ్



పార్టీ కార్యాలయంలో ధర్నా చేస్తున్న గాజువాక తెలుగుదేశం పార్టీ నాయకులు

మహారాణిపేట: తెలుగుదేశం విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుపై ఆ పార్టీ నాయకులు తిరుగుబావుటా ఎగురవేశారు. ఆయన్ని పదవి నుంచి తప్పించాలని ఆ పార్టీ గాజువాక ప్రాంత నాయకులు, చంద్రబాబు మిత్రమండలి సభ్యులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలుగుదేశం నగర కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట బుధవారం ధర్నా చేశారు. పార్టీ కార్యక్రమంలో పాల్గొనడానికి కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని కలిసి ఆయనపై ఫిర్యాదు చేశారు. పల్లా కారణంగా గాజువాక నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్నారు. 86వ వార్డు పార్టీ అధ్యక్షుడు కత్రి ఈశ్వరరావు, బొడ్డు రమణను పల్లా శ్రీనివాసరావు పార్టీ నుంచి సస్పెండ్ చేయడం తగదన్నారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకులను తీవ్రంగా అవమానించి.. వేధించి బహిష్కరించారని ఆరోపించారు. వారు ఏనాడు పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించలేదన్నారు. వారి సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి పల్లా పదవులిస్తూ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సొంతంగా ఆలోచించలేని పల్లాకు పార్టీని నడపడం ఇష్టం లేకపోతే రాజీనామా చేయాలన్నారు. పార్టీ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పాంద్రంగి జయరాజు నాయుడు, అండిబోయిన గురుమూర్తి, దేవులపల్లి సీతారాం, ఈటి శీను, నెల్లు శ్రీను, బంధం అప్పలరాజు, మామిడి నరసింగరావు, ఈశ్వరరావు, ధనరాజు, వెంకటేష్, నాయుడు, పసుపులేటి శ్రీను, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శ్రీచైతన్య కాలేజీకి నిబంధనలు పట్టవా..?

రెండు పూటలా కళాశాల నిర్వహణపై బాలల హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం



విద్యార్థులతో మాట్లాడుతున్న కేసరి, డాక్టర్ సీతారాం

విశాఖ విద్య: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, విశాఖ నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీ రెండు పూటలా తరగతులు నిర్వహించడంపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విశాఖ నగరంలోని రామాటాకీస్ ఏరియాలో గల శ్రీ చైతన్య జూనియర్ కాలేజీని కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసరి అప్పారావు, సభ్యుడు డాక్టర్ జి.సీతారాం నేతృత్వంలోని బృందం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తారని విద్యార్థులు చెప్పడంతో కాలేజీ నిర్వాహకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు మీకు పట్టవా అంటూ ప్రశ్నించారు. తరగతి గదుల నుంచి విద్యార్థులందరినీ వెంటనే ఇళ్లకు వెళ్లిపోవాలని సూచించి, వారిని బయటకు పంపించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా వేసవి సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఇలాంటి కాలేజీలపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు నిఘా పెట్టాలని ఆదేశించారు. శ్రీచైతన్య జూనియర్ కాలేజీ నిర్వాహకులపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. వేసవి సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్క ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీ నిర్వహించడానికి వీల్లేదన్నారు. పర్యటనలో బాలల హక్కుల సంరక్షణ విభాగం ప్రతినిధి ఎ.ఆనంద్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా సమ్మెటివ్ పరీక్షలు

- ప్రైవేట్ స్కూళ్లలోనూ ఓఎమ్మార్ విధానం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు
- డీసీఈబీ ద్వారా పాఠశాలలకు సామగ్రి సరఫరా
- ఎస్సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు
- నేటి నుంచి సమ్మెటివ్ – 2 పరీక్షలు



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: సమాంతర చదువులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. కార్పొరేట్ మాయాజాలానికి అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఒకే విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు సమాయత్తమైంది. 2023 – 24 విద్యా సంవత్సరంలో ఎస్సీఈఆర్టీ రూపొందించిన పాఠ్యపుస్తకాలతోనే ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో తప్పనిసరిగా బోధన సాగాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన ముందస్తు చర్యలకు విద్యాశాఖ సిద్ధమైంది. 2022–23 విద్యా సంవత్సరానికి ఆఖరి పరీక్షలుగా ఈ నెల 20 నుంచి నిర్వహించతలపెట్టిన సమ్మెటివ్ అసెస్మెంట్-2 (సంగ్రహణాత్మక మదింపు) పరీక్షల్లో భాగంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్(సీబీఏ-3)పై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. 1 నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ స్కూళ్లతోపాటు, ప్రైవేటు పాఠశాలల్లోనూ ఓఎమ్మార్ విధానం అమలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు)లో ప్రయోగాత్మకంగా వీటిని నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు అంతా సిద్ధం చేశారు.

183 ప్రైవేటు స్కూళ్ల ఎంపిక

క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ నిర్వహణ కోసం ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులందరికీ ఎస్సీఈఆర్టీ తయారు చేసిన ప్రశ్నాపత్రాలతో పాటు, ఓఎమ్మార్ షీటు కూడా ఇస్తారు. జవాబులను ప్రశ్నాపత్రంలో టిక్ చేయడంతోపాటు రాయాలి. అదేవిధంగా ఓఎమ్మార్ షీట్‌లో బబుల్ చేయాలి. ఇదే విధానం అమలు కోసమని ఉమ్మడి విశాఖ జిల్లాలోని 183 ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లను ఎంపిక చేశారు. చదువుల్లో విద్యార్థుల వాస్తవ సామర్థ్యాలను మదింపు చేసే క్రమంలో గ్రామీణ, మండల కేంద్రం, పట్టణ, అర్బన్ ప్రాంతాల వారీగా పాఠశాలలను ఎంపిక చేశారు. ఇలా అల్లూరి సీతారామరాజులో 68 పాఠశాలల్లో 7,053 మంది, విశాఖపట్నంలో 49 పాఠశాలల్లోని 8,004 మంది, అనకాపల్లి జిల్లాలోని 66 స్కూళ్లలో 8,100 మంది విద్యార్థులకు ఓఎమ్మార్ విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు ఎంపిక చేసి, అవసరమైన సామగ్రిని ఉమ్మడి జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా పాఠశాలలకు సరఫరా చేశారు. మిగతా ప్రైవేటు స్కూళ్లల్లో గతంలో మాదిరే పరీక్షలు నిర్వహించనున్నారు.

మంచి ఫలితాలు వస్తాయి



పాఠశాల స్థాయిలో ఓఎమ్మార్ విధానం అమలు చేయడం వల్ల భవిష్యత్‌లో మంచి ఫలితాలు కనిపిస్తాయి. పదో తరగతి తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే పోటీ పరీక్షలకు ఓఎమ్మార్ విధానం అమలు చేస్తున్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు దీనిపై తర్ఫీదు ఇవ్వడం మంచి పరిణామం. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఒకే విధానం ఉండడం వల్ల వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి.

– యు.మాణిక్యం నాయుడు, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్, భీమిలి

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సమ్మెటివ్ అసెస్మెంట్ – 2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 20న ప్రారంభమై 26తో పరీక్షలు ముగిస్తాయి. 27న మూల్యాంకనం పూర్తి చేసి, ప్రమోషన్ లిస్టు తయారు చేసేలా ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి. 28న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతిని వారికి తెలియజేసి, తదుపరి తరగతుల్లోకి ప్రమోట్ చేసిన జాబితాను పాఠశాలల్లో ప్రదర్శించాలి.

– ఎం.వి.కృష్ణ కుమార్, డీసీఈబీ సెక్రటరీ, ఉమ్మడి విశాఖ జిల్లా

సముద్రంలో యువకుడు గల్లంతు



తీరంలో గాలిస్తున్న గార్డులు

బీచ్‌రోడ్డు: సముద్రంలో భారీ అలల తాకిడికి ఓ యువకుడు గల్లంతయ్యాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన శ్రీరామ్ (19) నగరంలో ఐటీఐ చదువుతూ కైలాసపురంలో బాబాయి వద్ద ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆర్కేబీచ్‌కు వచ్చారు. గంటకు పైగా తీరంలో ముగ్గురూ స్నానం చేశారు. ఇంతలో ఒక పెద్ద అల వచ్చి శ్రీరామ్‌ను సముద్రం లోపలికి లాక్కుపోయింది. దీంతో స్నేహితులు గట్టిగా అరవడంతో బీచ్‌గార్డులు సంఘటన స్థలానికి చేరుకుని శ్రీరామ్ కోసం గాలించారు. సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభించలేదు.

ఏసీఏ సీనియర్ మెన్ సెలక్షన్‌కు కమిటీ

విశాఖ స్పోర్ట్స్: మెన్ సీనియర్స్ జట్ల సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేశామని ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ రెడ్డి తెలిపారు. కమిటీకి చైర్మన్‌గా ఆర్వీసిహెచ్ ప్రసాద్, సభ్యులుగా అచ్యుత్‌రావు, కెఎస్‌టి సాయి, ఎం.సురేష్ వ్యవహరించనున్నారన్నారు. 2023–24 డొమెస్టిక్ సీజన్‌కు కమిటీ, ఏసీఏ బైలాస్ ప్రకారం సీనియర్స్ జట్లను అన్ని ఫార్మెట్లకు ఎంపిక చేయనుందన్నారు.

అందుబాటులోకి జీసీసీ సోడా హబ్



సోడాహబ్ ప్రారంభిస్తున్న జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, ఎండీ సురేష్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం : గిరిజనుల నుంచి సేకరిస్తున్న అటవీ ఫలసాయముల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తూ గిరిపుత్రుల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు విభిన్న ఆలోచనలతో ముందుకు వెళ్తున్నామని జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఎండీ సురేష్‌కుమార్ అన్నారు. గిరిజన సహకార సంస్థకు సంబంధించి రిటైల్ నెట్‌వర్క్ ద్వారా ''గిరిజన్ బ్రాండ్'తో బిల్వ (మారేడు కాయలు), నన్నారి(మారేడుగడ్డలు) నుంచి తయారు చేసే షర్బత్‌లతో సోడాహబ్‌ని అందుబాటులోకి తీసుకొచ్చారు. జీసీసీ నిర్వహిస్తున్న హట్ అరబికా కాఫీ షాప్ సమీపంలో సోడాహబ్‌ని శోభాస్వాతిరాణి, సురేష్‌కుమార్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేలా అతి తక్కువ ధరకే, సహజ పానీయాలైన నన్నారి, బిల్వ షర్బత్‌ని సోడా హబ్‌ల ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ షర్బత్‌లు తాగడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, శరీరానికి చల్లదనం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీసీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



శేఖర్ మృతదేహం

కూర్మన్నపాలెం: బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన యువకుడు.. తిరిగి స్వగ్రామానికి వస్తూ వడ్లపూడి రహదారి పక్కన ఉన్న బస్‌స్టాప్‌లో విగతజీవిగా కనిపించాడు. అతని మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం కన్నూరు గ్రామానికి చెందిన ముత్తా శేఖర్(31) బతుకుదెరువు కోసం ఐదు నెలల కిందట హైదరాబాద్ వెళ్లాడు. ఈ క్రమంలో ఈ నెల 17న హైదరాబాద్ నుంచి తన సొంతూరుకు బయలుదేరాడు. హైదరాబాద్‌లో అతని బాబాయ్ సాగర్ బస్సు టికెట్ తీసి.. బస్సు ఎక్కించి పంపాడు. 18వ తేదీన శేఖర్ ఇంటికి రాకపోవడంతో.. అతని అన్న రవికుమార్ ఆందోళన చెందాడు. శేఖర్‌కు ఫోన్ చేసినా సమాచారం లేకపోవడంతో.. బాబాయ్‌ను సంప్రదించాడు. అతని బస్సు టికెట్ వివరాలను రవికుమార్‌కు పంపాడు. ఆ టికెట్ ఆధారంగా డ్రైవర్‌ను కలవడంతో.. శేఖర్ 18న ఉదయం 11 గంటలకే వడ్లపూడిలో దిగినట్లు సమాచారం అందించాడు. దీంతో రవికుమార్, అతని మిత్రులు, కుటుంబసభ్యులు శేఖర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో.. దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. వడ్లపూడి రహదారి పక్కన ఉన్న బస్టాప్‌లో ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని బుధవారం ఉదయం గుర్తించిన పాదచారులు దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసరావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న పర్స్, సెల్‌ఫోన్ ఆధారంగా రవికుమార్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి.. శేఖర్‌గా గుర్తించారు. శేఖర్ మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. రవికుమార్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. శేఖర్‌కు ఎవరైనా శత్రువులు ఉన్నారా? బస్సు దిగిన తర్వాత ఎవరిని కలిశాడు? తదితర వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

'వాల్తేర్ డివిజన్‌లో ఉద్యోగులపై వేధింపులు'

సీతంపేట: వాల్తేర్ రైల్వే డివిజన్‌లో ఉద్యోగులపై వేధింపులతో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, దీనిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టి సారించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని విశ్రాంత రైల్వే ఆఫీస్ సూపరింటెండెంట్ (విజయవాడ డివిజన్), చైతన్య భారతి సంస్థ అధ్యక్షులు బి.చిట్టిరాజు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్తేర్ రైల్వే డివిజన్‌లో ఉన్నతాధికారుల అవినీతిని ప్రశ్నించిన వారిని వేధించి సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా డివిజన్‌లో పనిచేస్తున్న ఎస్సీ కులస్తులను వేధిస్తున్నారన్నారు. ఇక్కడి రైల్వే ఆస్పత్రిలో కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించిన డాక్టర్ ఎం.విజయ్‌కుమార్‌ను ఈ విధంగానే సంబల్‌పూర్ బదిలీ చేశారన్నారు. డాక్టర్ కె.ఆర్.ఎస్.కాశీపతి (అడ్మిన్) గత 25 ఏళ్లుగా ఇక్కడే తిష్టవేసినా ఎందుకు బదిలీ చెయ్యలేదని ప్రశ్నించారు. మరో డాక్టర్ ఎం.మహేష్ కుమార్ 20 ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తూ అక్రమాలకు పాల్పడుతూ, మహిళా ఉద్యోగులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఒక మహిళా ఉద్యోగి ఆత్మహత్య విషయంలో ఈయనపై అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమైనా విచారణ జరగలేదన్నారు. రైల్వే ఆస్పత్రి, ఇంజినీరింగ్ విభాగాల్లో వైద్యులు, సూపర్‌వైజర్లు వేధింపులకు గురవుతున్నారని ఆరోపించారు. డివిజన్‌లో ఇంత తీవ్ర స్థాయిలో వేధింపులు కొనసాగుతున్నా డీఆర్ఎం దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా వేధింపులపై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు విచారణ చేపట్టి, దోషులను శిక్షించి ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

విశాఖపట్నం-రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజినల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి బుధవారం ఆయా విభాగాల అధికారులతో కలిసి విశాఖపట్నం – రాయగడ సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా విజయనగరం రైల్వేస్టేషన్‌లో రిటైరింగ్ రూమ్‌లు, క్యూ లాబీ, ప్రీపెయిడ్ ఏసీ లాంజ్, కార్యాలయాలను తనిఖీ చేశారు. అనంతరం గజపతినగరం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సెక్షన్ పరిధిలో జరుగుతున్న మూడో లైన్ పనులను కూడా పరిశీలించారు. పార్వతీపురం స్టేషన్‌లో పర్యటించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు.

రాయగడ వరకు విండో ట్రయలింగ్ తనిఖీ చేశారు. రాయగడ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది, రైల్వే కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సీనియర్ డివిజినల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, పీకే మహారాణా, ఏకే త్రిపాఠి, ఎస్కే పాత్ర, సీహెచ్ కామేశ్వర్రావు, ప్రవీణ్ భటి, శివానంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండగల వెనుక గొప్ప సందేశం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

ఇఫ్తార్ విందులో కలెక్టర్ మల్లికార్జున

బీచ్‌రోడ్డు: పండగ అనేది ఏ మతానికి సంబంధించినదైనా.. దాని వెనుక గొప్ప సందేశం దాగి ఉంటుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో బుధవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రతి నెలా ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5వేలు చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నట్లు చెప్పారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం అన్నారు. ముందుగా నమాజ్ చేసి ఇఫ్తార్ విందు ప్రారంభించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ చినతల్లి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మాజీ ఎమ్మెల్యే రెహమాన్, కార్పొరేటర్లు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

భిన్నమైన కథ, కథనంతో ఏజెంట్

- యువ నటుడు అక్కినేని అఖిల్



మాట్లాడుతున్న హీరో అక్కినేని అఖిల్

బీచ్‌రోడ్డు: విభిన్నమైన కథ, కథనంతో రూపొందించిన చిత్రం ఏజెంట్ అని ఆ సినిమా హీరో అఖిల్ అక్కినేని అన్నారు. ఏజెంట్ చిత్రం ప్రమోషన్లలో భాగంగా నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. దర్శకుడు సురేంద్రరెడ్డి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఈ చిత్రాన్ని రూపొందించారన్నారు. చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయన్నారు. విశాఖ నగరం అంటే తనకు చాలా ఇష్టమని.. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించినట్లు చెప్పారు. అవకాశం వస్తే రామ్‌చరణ్‌తో మల్టీస్టారర్ చిత్రం చేయాలని ఉందన్నారు. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ లాంటి కథలపై ఆసక్తి ఉందన్నారు. హీరోయిన్ సాక్షి విద్య మాట్లాడుతూ తనకు ఇదే తొలి చిత్రమని.. తన పాత్ర వైవిధ్యంగా ఉంటుందన్నారు. ఈ నెల 28న విడుదలవుతున్న ఏజెంట్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

విష్ణు కెమికల్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని విష్ణు కెమికల్ పరిశ్రమలో మంగళవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు ఇండాల్‌కు తీవ్రంగా, ఉమాశంకర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలివీ.. విష్ణు కెమికల్ పరిశ్రమలో వార్షిక మరమ్మతు పనులు జరుగుతున్నాయి. బ్యాంకు కాలనీలో నివాసం ఉంటున్న కార్మికులు ఇండాల్, ఉమాశంకర్ ఈ పరిశ్రమంలో పనులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి కిలాన్ అనే ప్రదేశాన్ని శుభ్రం చేస్తున్న క్రమంలో క్రోమ్ అండ్ సోడా యాష్ అనే మిశ్రమం ముద్ద వారిపై పడింది. ఇండాల్ తలపై ఈ మిశ్రమం పడటం వల్ల చర్మం తీవ్రంగా కాలిపోయింది. ఉమాశంకర్‌కు స్వల్పంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వీరిని నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ప్రమాదంపై సమగ్రంగా దర్యాప్తు జరపాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

నెమలిపురికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



సత్యనారాయణను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్/తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం పరిశోధక విద్యార్థి డాక్టర్ నెమలిపురి సత్యనారాయణ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. 'ప్రిజన్ రైటింగ్ డ్యూరింగ్ ఎమర్జెన్సీ ఇన్ ఇండియా–ఎ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేసి ఏయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఎమర్జెన్సీ సమయంలో జైళ్లలో ఉండి రచనలు చేసిన వారి వివరాలు, వారి రచనలపై సమగ్రంగా అధ్యయనం చేశారు. అప్పటి పరిస్థితులను నేటి తరం తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఆయన ప్రిజన్ లిటరేచర్‌పై పరిశోధన చేపట్టారు. ఈ క్రమంలో మాజీ ఉప ప్రధాని ఎల్.కె.అద్వానీని కూడా కలిశారు. ఈ పరిశోధనను ప్రత్యేకమైన సామాజిక బాధ్యత గలిగిన చర్యగా భావించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించింది. ఈ సందర్భంగా నెమలిపురిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి, జిల్లా ఇన్‌చార్జి వేముల భాస్కరాచారి, అనిట్స్ ప్రిన్సిపాల్ కాల్వ శ్రీరామకృష్ణ అభినందించారు. ఆయన సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

నెక్స్ట్ వేవ్‌తో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ ఒప్పందం

సాక్షి, విశాఖపట్నం: ఏపీ యువతకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలో ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా నెక్స్ట్ వేవ్ సంస్థతో ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్‌కుమార్ తెలిపారు. ఆవిష్కరణలను ప్రోత్సహించడం, వ్యవస్థాపకతను మెరుగుపరచడంతోపాటు రాష్ట్రంలో స్టార్టప్‌లను అభివృద్ధి చేసే దిశగా సంయుక్త భాగస్వామ్యంతో అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. యువతకు ఇండస్ట్రీ అవసరాలకు సరిపడే శిక్షణ అందిస్తూ నైపుణ్యాలు పెంపొందించుకునేలా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రోగ్రామ్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో స్టార్టప్ వ్యవస్థకు ఊతమివ్వనున్నామని పేర్కొన్నారు. 12వ తరగతి నుంచే కోడింగ్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్ అవసరాలకు తగిన రీతిలో ఆకర్షణీయమైన కెరీర్‌లను పొందేలా రాష్ట్రంలోని విద్యార్థులకు మార్గం చూపించనున్నామని నెక్స్ట్ వేవ్ సీఈవో రాహుల్ అత్తులూరి వివరించారు. సర్టిఫైడ్ ఆన్‌లైన్‌లో బూట్ క్యాంప్స్ నిర్వహించడం, వర్చువల్ 4.0 టెక్ కమ్యూనిటీని ఏర్పాటు చేసి సంబంధిత స్టేక్ హోల్డర్లకు అత్యాధునిక సాంకేతికతలతో నైపుణ్య శిక్షణ అందించనున్నామని తెలిపారు.

టెన్త్ స్పాట్ ప్రారంభం

విశాఖ విద్య: పదో తరగతి మూల్యాంకనం బుధవారం ప్రారంభమైంది. విశాఖ జిల్లాకు సంబంధించి క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల హైస్కూల్లో ఇందుకోసమని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మూల్యాంకనం విధులకు కేటాయించిన వారిలో 981 మంది ఉపాధ్యాయులు తొలిరోజు రిపోర్ట్ చేశారు. అసిస్టెంట్ ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్‌లకు వారికి కేటాయించిన విభాగాల వారీగా మూల్యాంకనం కోసమని జవాబు పత్రాలను అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల ప్రాంగణంలో టెంట్లు ఏర్పాటు చేశారు. మినరల్ వాటర్ సౌకర్యం కల్పించారు. ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మూల్యాంకనం ప్రక్రియలో ఎలా వ్యవహరించాలనే దానిపై డీఈవో ఎల్.చంద్రకళ ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. నిబంధనల మేరకు ప్రతీ రోజూ 40 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలన్నారు. సకాలంలో మూల్యాంకనం ప్రక్రియ పూర్తి చేసేందుకు మరో 90 మంది వరకు ఉపాధ్యాయులు అవసరం ఉందని, గురువారం నుంచి వారిని విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీ మోహన్, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.